# గుండు గుండు గుమ్మం దగ్గర ఉండు

"ఏదో ఎర్రగా బుర్రగా ఆరడుగుల ఎత్తుగలవారని, పోస్టుగ్రాడ్యుయేట్ అనీ మీకు నన్ను కట్టపెట్టారు మావాళ్ళు. పైగా ఇంకో అరగంటలో తాళి కట్టవలసి వస్తూంటే బోల్డుమంది మీకు ఫోన్లు చెయ్యడం. మీరేమో మీ మొబైల్ ఓ చేతిలోంచి ఇంకో చేతిలోకి స్టైల్‌గా మార్చుకుంటూ, "మీకెందుకు మీరు కామ్‌గా ఉండండి, నేను వచ్చి అన్నీ సర్దుబాటు చేస్తానంటే", మీ తోటి ఉద్యోగస్థులకి తెలీని విషయాలు వాళ్ళకి తెలియపరుస్తారేమో ననుకున్నారు మావాళ్ళు. తీరా కాపరానికి వచ్చిన తర్వాత నేను తెలుసుకున్న విషయం- మా వాళ్ళిచ్చిన కట్నం మీరు చేసిన అప్పులు తీర్చడానికి మూడు పాళ్ళ వరకే సరిపోయింది. పెళ్ళయి నాలుగేళ్ళయిపోయింది. మనకి పుట్టిన పిల్లాడికి మూడేళ్ళు వచ్చేసి వాడికి మాటలు కూడా వచ్చేశాయ్ కాని మీకు ఉద్యోగం మాత్రం రాలేదు" అంటూ ఏక లాకీన దంచేసింది దమయంతి.

"ఇదంతా నా కర్మ! యూనివర్సిటీలో నాతో చదువుకున్న వారందరికీ ఉద్యోగాలు వచ్చాయ్. నాకు ఎం.ఎ, ఫస్ట్‌క్లాస్ కూడా వచ్చింది. కాని ఉద్యోగం మాత్రం రాలేదు. మహారాజులా బ్రతుకుదామనుకున్నాను. అసలు ఈ నలుడు అని ఎందుకు పేరు పెట్టారో తెలియదు. నలమహారాజు పడినన్ని కష్టాలు పడుతున్నాను. పోనీ పెళ్ళయిన తర్వాతనైనా కష్టాలు తీరతాయనుకుంటే, నలుడి భార్య పేరుగల దానివి 'దమయంతి'వి నువ్ చుట్టుకున్నావ్" అన్నాడు నలుడు.

"నలుడు" - అని ఎందుకు పేరు పెట్టారో అంటారేమిటి ఉద్యోగం రాకపోతే వంటలు చేసయినా నన్ను పోషిస్తారని"

"ఈ ఒక్కరోజు గడిపెయ్! రేపు పిల్లాడితో సహా మనిద్దరం "రామ్‌నగర్ గుండు" దగ్గర ఉన్న మా దూరపు చుట్టాన్ని కలుద్దాం. ఆయన చాలా మందికి ఉద్యోగాలు వేయించాడట. ఓ ఆర్నెల్ల క్రితమే అమెరికానుంచి మన దేశానికి వచ్చేశాడు. ఆయన తలుచుకుంటే నాకొక ఉద్యోగం వేయించడం పెద్దపని కాదు" అన్నాడు నలుడు.

"నేనూ పిల్లాడూ ఇంట్లోనే ఉంటాం. వీడొక వాగుడుకాయ. మీరొక్కరే వెళ్ళిరండి"

"అలాకాదు, మీ ఇద్దర్నీ చూస్తే నాకు ఉద్యోగం ఎంత అవసరమో ఆయనకి బాగా అర్థమవుతుంది. అందరం వెళదాం".

ఆ మర్నాడు రామ్‌నగర్ గుండుకి బయల్దేరింది సంసారం.

నలుడు ఆ ప్రాంతానికి ఎప్పుడూ రాలేదు. ఆటోవాడు "ఇదే రామ్‌నగర్" అని విద్యానగర్‌లో దింపేశాడు.

"రామ్‌నగర్ గుండు ఎక్కడ" అంటూ నడక సాగించింది ఆ కుటుంబం.

నలుడు కొడుకు పెద్ద అల్లరి రకం. ఎవరో పెద్దాయన రెండ్రోజుల క్రితమే చేయించుకున్న గుండుతో నడిచి వెళుతూంటే నలుని బుడతడు ఆయన గుండు చూపిస్తూ, "ఇదిగో ఇదే రామ్‌నగర్ గుండు" అన్నాడు.

ఆయన పిల్లాడ్ని ముద్దుపెట్టుకుని ఓ పది రూపాయలు చేతిలో పెట్టాడు. ఇటువంటివి ఇంకో రెండు గుళ్ళు తగులుతే ఓ ఐస్‌క్రీం వస్తుందనుకున్నాడు బుడతడు.

రామ్‌నగర్ గుండు గురించి ఇంకో యిద్దర్ని అడిగి మొత్తం మీద ఆ ఉద్యోగం గురించి అడగవలసిన పెద్ద మనిషిని కలిశారు. ఆయన చాలా మర్యాదగా "నా పేరు మూర్తి" అంటూ కరచాలనం చేశాడు. ఆయన బహుశః తిరుపతిలో మొక్కు ఇచ్చాడు కాబోలు. ఆయనకీ ఒక గుండు ఉంది.

"ఈ రామ్‌నగర్ గుండు దగ్గర ఉన్న చాలా మందికి గుళ్ళు ఉన్నాయ్" అనుకున్నాడు నలుడు. వెంటనే, తన బుడతడు ఆయన గుండు గురించి మాట్లాడకుండా ఉండగలందులకు దేవుడికి దండం పెట్టుకున్నాడు.

నలుడి బయోడేటా తీసుకుని ఓ రెండ్రోజుల్లో ఆఫీస్‌కి వచ్చి కలవమన్నాడు.

"హమ్మయ్య" అనుకున్నాడు నలుడు.

మూర్తిగారు సింహద్వారం దాకా వచ్చి సాగనంపుతూంటే, మాయదారి బుడతడు "గుండు గుండు గుమ్మం దగ్గర ఉండు' అని ఏమైనా సొమ్ములు ముడతాయేమోనని ఆయనకేసి ఆశగా చూసాడు.

ఆ పెద్దాయనికి కోపం వచ్చింది. వాళ్ళు బయటకి వెళ్ళగానే భళ్ళుమని వీధి తలుపు వేసేశాడు. ఈ "గుండు" గొడవ తన డ్రైవర్‌గాని విన్నాడేమోనని కిటికీ సందులోంచి చూశాడు. వాడి గుండు తడుముకుంటూ నవ్వుకుంటున్నాడు డ్రైవర్. వీడికి డ్రైవింగ్‌కి సంబంధించిన విషయాలు తప్ప అన్నీ కావాలి అనుకున్నారు మూర్తి.

భోజనాల తర్వాత మిసెస్ మూర్తి "వాళ్ళు ఎందుకొచ్చారని" అడిగింది.

ఉద్యోగం గురించి వచ్చారని తెలుసుకుని "ఇంత అల్లరి వెధవని కన్నవాడు ఉద్యోగం తిన్నగా ఏం చేస్తాడండి, మీ గుండు గురించి కవితారూపంలో పలికాడు ఆ బడుతడు. నాకు నిజంగా సిగ్గేసింది" అంది.

ఆ మర్నాడు ఆఫీస్‌లో తన అసిస్టెంట్ మేనేజర్ని పిలిచాడు మూర్తిగారు.

ఆయన మూర్తిగారి తలుపు ఓరగా తెరిచి ఆయన ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతూంటే, బయట గుమ్మం దగ్గరే నిలబడ్డాడు.

తర్వాత మెల్లిగా లోపలికి వెళ్ళాడు.

"నేను నిన్ను ఎంతోసేపయింది పిలిచి" అని మూర్తిగారు గట్టిగా అరిచారు. నిన్న ఆ బుడతడి కవితా రూపం చెవుల్లో గింగురుమంటోంది.

"బయట గుమ్మం దగ్గరే ఉన్నానండి" అన్నాడు వినయంగా అసిస్టెంట్ మేనేజర్.

"ఏం! నీకేమయినా గుండు ఉందా, గుమ్మం దగ్గర ఉండడానికి' అని అరిచాడు మూర్తి.

"సారీ సార్! గుండు లేకుండా గుమ్మం దగ్గర ఉండకూడదన్న విషయం నాకు తెలీదు" అన్నాడు వినయంగా, ఈసారి ఓ పెద్ద ఇంక్రిమెంట్ ఇస్తారేమోనని.

"ఏం మాట్లాడుతున్నావయ్యా! అంటే నాకు గుండు ఉంది కనక నేను గుమ్మం దగ్గర ఉంటే, నువ్ మెల్లిగా నా సీటులో కూర్చుందామనా! ఫో నిన్ను విజయవాడ బదిలీ చేస్తున్నాను" అన్నారు మూర్తి.

సాయంకాలం ఇంటికెళ్ళి, విజయవాడ బదిలీ అయిందని చెప్పాడు అసిస్టెంట్ మేనేజర్.

వివరాలు తెలుసుకుని, ఆయన భార్య "అసలు ఈ గుండు గొడవేమిటండీ, నేనొచ్చి ఆ గుండుగాడితో మాట్లాడనా! ఆయనకి మళ్ళీ జుట్టు రాకుండానే ఇటువంటి విషయాలు తెలిపోవాలి" అంది.

"వద్దు. ఆయనతో పెట్టుకుంటే నా ఉద్యోగం తీసేసి, నాకు గుండు కొట్టించి, ఆఫీసు గుమ్మం బయటికి తోసేస్తాడు, ఆయన బహు మేధావి"

ఓ రెండ్రోజుల తర్వాత, నలుడికి ఒక కవరు వచ్చింది. అది అతని బయోడేటాయే! మూర్తిగారు రాసిన ఓ చిన్న ఉత్తరం కూడా ఉంది.

"పిల్లల్ని కనిపారేయడం కాదు. చిన్నప్పట్నించీ వాళ్ళకి మంచి బుద్ధులు నేర్పాలి. వాడి వయస్సేమిటి, నా వయస్సేమిటి? నా గుండు మీద కవితా స్రవంతి ప్రవహింపచెయ్యడం ఏమిటి! వేరే ఎక్కడయినా ఉద్యోగ ప్రయత్నం చేసుకో"

ఆ ఉత్తరం తన భార్యకి చూపించాడు నలుడు. "అసలు "గుండు గుండు గుమ్మం దగ్గర ఉండు" అని వీడికి ఎవరు నేర్పారు"

"మన కర్మండీ! వీడు అన్నీ జ్ఞాపకం పెట్టుకుంటాడు. వీడికి ఓసారి తిరుపతిలో మొక్కు ఇచ్చాం కదా! అప్పుడు మా పెద్దన్నయ్య వీడ్ని చూసి "గుండు గుండు గుమ్మం దగ్గర ఉండు" అని ఉడికించేవాడు. వీడేమో ఆ రామ్‌నగర్ గుండు దగ్గర ప్రయోగించాడు. మీకిప్పట్లో ఉద్యోగ యోగం లేదన్నమాట!"

---

(ఆంధ్రభూమి వారపత్రిక 28-3-2013)